నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శుక్రవారం 22 డిసెంబర్ 2023 | KAMAREDDY

అవసరానికి సరిపడా ఎరువుల నిల్వలు

- డీసీవో సింహాచలం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 21 : యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులు మార్క్‌ఫెడ్ వద్ద అందుబాటులో ఉన్నాయని జిల్లా సహకార అధికారి సింహాచలం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన భరోసా కల్పించారు. మార్క్‌ఫెడ్‌కు ముందుగానే డబ్బులు చెల్లించి జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లాలోని అన్ని సహకార సంఘాల కార్యదర్శులను ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని డీసీవో తెలిపారు.

తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య తల్లి మృతి

రాజంపేట్, డిసెంబర్ 21 : రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య తల్లి లక్ష్మవ్వ (85) గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నది. కాగా లక్ష్మవ్వ అంత్యక్రియలు వారి స్వగ్రామం రాజంపేట్ మండలం శివాయిపల్లిలో నిర్వహించారు. లక్ష్మవ్వ మృతికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో పోలీసు శాఖలో విధులను నిర్వహిస్తున్న కిష్టయ్య తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించలేక ప్రాణత్యాగం చేయడంతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది.

లక్ష్మవ్వ (ఫైల్) ➤

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం

- సీఎంసీ కళాశాలను పరిశీలించిన కలెక్టర్

సీఎంసీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఇందల్వాయి, డిసెంబర్ 21 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు డిచ్‌పల్లిలోని సీఎంసీ మెడికల్ కళాశాలను గురువారం పరిశీలించారు. ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి ఈ కళాశాల అనువుగా ఉన్న గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో జరిగే పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు నిర్వహించాల్సి ఉన్నందున అందుకు అనుగుణంగా కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను అదనపు కలెక్టర్లు, చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ ఎస్.జయరాంలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

- బీఆర్ఎస్ శ్రేణులకు బాజిరెడ్డి సూచన

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి

ఖలీల్‌వాడి(మోపాల్), డిసెంబర్ 21: బీఆర్ఎస్ కార్యకర్తలు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సూచించారు. మంచిప్ప గ్రామంలోని సర్పంచ్ సిద్ధార్థ ఫాంహౌస్‌లో గురువారం కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిప్ప ప్రాజెక్టును పాత డిజైన్ ప్రకారమే పనులు జరిపేలా చూడాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధార్థ, ఉప సర్పంచ్ జగదీశ్, కోఆప్షన్ సభ్యుడు అజీమ్, బీఆర్ఎస్ మోపాల్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకును కడతేర్చిన తండ్రి

- అనంతరం తానూ ఆత్మహత్య
- డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ
- కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలో ఘటన

సురేశ్, వసంత్‌రావు (ఫైల్)

గాంధారి, డిసెంబర్ 21: తండ్రి, కొడుకు మధ్య డబ్బుల విషయంలో మొదలైన గొడవ ఇద్దరి ప్రాణాలను బలిగొంది. కోపంలో కుమారుడిపై కత్తితో దాడి చేసి చంపేసిన తండ్రి.. అనంతరం తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పెద్ద గుజ్జల్ తండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రేమ్‌దీప్, స్థానికులు తెలిపిన ప్రకారం.. పెద్ద గుజ్జల్ తండాకు చెందిన బదావత్ వసంత్‌రావు(48)కు ఇద్దరు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య కుమారుడు బదావత్ సురేశ్ (27) ఉపాధి నిమిత్తం దుబాయ్‌కు వెళ్లి ఇటీవలే గ్రామానికి తిరిగి వచ్చాడు. అయితే, దుబాయ్ నుంచి పంపించిన డబ్బులు విషయంలో బుధవారం రాత్రి తండ్రి, కొడుకు మధ్య వాగ్వాదం జరిగింది. మద్యం మత్తులో వసంత్‌రావు.. కుమారుడి ఛాతిలో పొడవడంతో సురేశ్ కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు అతడ్ని గాంధారిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరోవైపు, కొడుకుపై దాడి చేసిన వసంత్‌రావు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో అతడ్ని నిజామాబాద్‌లోని దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు.

ఆందోళన వద్దు..

- కరోనా వైరస్‌పై వైద్యశాఖ అలర్ట్
- ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తే మేలు
- ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలకు ఏర్పాట్లు
- భయపడ వద్దంటున్న వైద్యనిపుణులు

రాష్ట్రంలో 15 మందికి కొత్త వేరియంట్ జేఎన్-1ను గుర్తించారు. ఇప్పటికే కరోనా వ్యాధిపై వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. చలి కాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు పలు చర్యలు చేపట్టింది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటే వైరస్ వ్యాప్తిని అరికట్ట వచ్చని వైద్యులు తెలుపుతున్నారు.

నిజామాబాద్ దవాఖానలో ఏర్పాట్లు ..

నిజామాబాద్ జిల్లా కేంద్ర దవాఖానలో వైద్యసిబ్బంది అప్రమత్తమైంది. ఐసీయూ, వెంటిలేటర్, ఆక్సిజన్ బెడ్లను అందుబాటులో ఉంచారు. కొవిడ్‌ను ఎదుర్కొనేందుకు నూతన వార్డును ఏర్పాటు చేశారు. కొవిడ్ టెస్టుల కోసం ప్రత్యేకంగా వెనుకభాగంలో ఓపీని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి ప్రభుత్వ దవాఖానలో కొవిడ్ టెస్టులు అందుబాటులో ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

జ్వరం, జలుబు, గొంతు సమస్యలు పెరుగుతున్న ఈ తరుణంలో కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్నదని వైద్య, ఆరోగ్య శాఖ హెచ్చరికలు చేయడంతో జనంలో ఆందోళన నెలకొన్నది. మాస్కులు ధరించి జాగ్రత్తగా ఉండాలని అధికారులు అంటున్నారు. చలి జ్వరం, జలుబుతో ఇబ్బంది పడుతున్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. 10 ఏండ్ల లోపు పిల్లలు, 60 ఏండ్లు దాటిన వారు, గర్భిణులు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని సూచిస్తున్నారు. వీలైనన్ని ఎక్కువసార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేయాలంటున్నారు. విందులు, వినోదాలను తగ్గించుకోవాలని తెలుపుతున్నారు.జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇంటి లోపల వెచ్చని వాతావరణం ఉండేలా చూసుకోవాలని, వీలైనంతగా పిల్లలు,వృద్ధులు ఉన్ని దుస్తులను ధరించాలి.

ఇవి చేయాల్సినవి..

- రద్దీ ప్రాంతంలో మాస్క్ ధరించాలి
- కరచాలనం చేయకుండా నమస్కారం చేయడమే మేలు
- చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రం చేసుకోవాలి
- తుమ్మినా దగ్గినా నోటికి రుమాలు అడ్డుపెట్టుకోవాలి
- జలుబు, దగ్గు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి
- ప్రతి రోజు గోరువెచ్చని నీటిని తాగాలి. పౌష్టికాహారాన్ని తీసుకోవాలి
- అనుమానిత లక్షణాలు ఉంటే కరోనా నోడల్ కేంద్రాన్ని ఆశ్రయించాలి

అప్రమత్తతే ప్రధానం

కరోనా అంటేనే ప్రతి ఒక్కరిలో వణుకు పుడుతున్నది. 2020-21లో రెండు సార్లు ఈ మహమ్మారి యావత్ ప్రపంచాన్ని వణికించింది. కరోనా వైరస్ వలన చాలా కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయి. వైరస్ నివారణకు ప్రభుత్వం ప్రతి ఒక్కరికి రెండు సార్లు కరోనా వ్యాక్సిన్, బూస్టర్ డోస్ ఇప్పించింది. దీంతో కరోనా తగ్గు ముఖం పట్టింది. ప్రస్తుతం మళ్లీ కరోనా వైరస్ వ్యాపిస్తుందన్న వార్తలు కలవర పెడుతున్నాయి. అయితే అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు.

-కామారెడ్డి/ఖలీల్‌వాడి, డిసెంబర్ 21

భయపడొద్దు..

నిజామాబాద్ జీజీహెచ్‌లో కొవిడ్ వైద్యం కోసం సర్వం సిద్ధం చేశాం. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. కొవిడ్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. బెడ్లు, ఐసీయూ, జనరల్ వార్డులను సిద్ధం చేశారు. మాస్క్ తప్పని సరిగా పెట్టుకోవాలి, అవసరమైతే తప్ప బయటికి రావద్దు.

-ప్రతిమారాజ్, సూపరింటెండెంట్, జీజీహెచ్

అప్రమత్తంగా ఉండాలి..

కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కరోనా తాత్కాలిక మైన జలుబు లాంటిది, తగిన జాగ్రత్తలు, వైద్య సలహాలు, సూచనలు పాటిస్తే కరోనాను తరిమికొట్టవచ్చు. కరోనాను అందరం కలిసి కట్టుగా పోరాడి జయించాలి.

-లక్ష్మణ్‌సింగ్, డీఎంహెచ్‌వో, కామారెడ్డి

జీజీహెచ్‌లో సిద్ధం చేసిన కొవిడ్ వార్డును పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

శాన్విక, ప్రసాద్ మృతదేహాల గుర్తింపు

- కుళ్లిన స్థితిలో లభ్యం
- ఘటనా స్థలాల్లోనే పోస్టుమార్టం

మదన్‌పల్లి శివారులో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రసాద్ (ఫైల్)

శాన్విక (ఫైల్)

నవీపేట/మాక్లూర్, డిసెంబర్ 21: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆరు హత్యకేసుల్లో మృతుడు పూనే ప్రసాద్, భార్య శాన్విక అలియాస్ రమణి(28) మృతదేహాలను పోలీసులు ఎట్టకేలకు గురువారం గుర్తించారు. నవీపేట మండలం యంచ రైల్వే బ్రిడ్జి సమీపంలో గోదావరి నది ఒడ్డుకు చేరుకున్న శాన్విక మృతదేహాన్ని ఎల్లారెడ్డి ఏసీపీ శ్రీనివాస్‌రావు, నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్, సదాశివనగర్ సీఐ రామన్, ఎస్సై యాదగిరిగౌడ్ ఘటనా స్థలంలో పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనా స్థలంలోనే నవీపేట డిప్యూటీ తహసీల్దార్ హాజీ, ఆర్ఐ మోహన్ సమక్షంలో పంచనామా చేసి అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. సీఐ సతీశ్ కుమార్ మాట్లాడుతూ మృతదేహాన్ని అత్త సుశీల, తల్లి కళావతి గుర్తు పట్టినట్లు తెలిపారు. పోస్టు మార్టం అనంతరం శాన్విక మృతదేహాన్ని బంధువులకు అప్పచెప్పినట్లు సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు.

మదన్‌పల్లిలో ప్రసాద్ మృతదేహం..

నిందితుడు ప్రశాంత్ సమాచారం మేరకు మాక్లూర్ మండలం మదన్‌పల్లి శివారు ప్రాంతంలో ప్రసాద్‌ను హత్య చేసి పూడ్చిన స్థలంలో పోలీసులు గురువారం మృతదేహాన్ని వెలికి తీశారు. అధికారులు, కుటుంబ సభ్యుల సమక్షంలో పంచనామా చేశారు. నిందితుడు ప్రశాంత్.. ప్రసాద్‌ను నవంబర్ 29న హత్యచేసి పూడ్చిపెట్టాడని, శవం పూర్తిగా కుళ్లిపోయిందని నార్త్ రూరల్ సీఐ సతీశ్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ షబ్బీర్ సమక్షంలో అధికారులు ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. సౌత్ రూరల్ సీఐ వెంకటనారాయణ, మాక్లూర్, నవీపేట్ ఎస్సైలు సుధీర్‌రావు, యాదగిరిగౌడ్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో బందోబస్తును నిర్వహించారు. శాన్విక మృతదేహాన్ని చూసి మాక్లూర్ గ్రామస్తులు, బంధువులు గుండెలవిసేలా రోదించారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు

'కల్యాణలక్ష్మి'తో పేదింటి ఆడబిడ్డలకు భరోసా

- అన్యాయాన్ని సహించేది లేదు
- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- 206 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

రుద్రూర్, డిసెంబర్ 21 : పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక భరోసా ఇస్తున్నాయని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రుద్రూర్, కోటగిరి, పొతంగల్, వర్ని, చందూర్, మోస్రా మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్యాయాన్ని సహించేది లేదని, ఈ అలవాటు తనకు పుట్టుకతో వచ్చిందన్నారు. ప్రతి గ్రామంలో అర్హులను ఎంపిక చేసే బాధ్యత ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలదే అన్నారు. నిజాయితీగా పని చేసే నాయకులకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా అమలు పరుస్తారో వేచి చూద్దామన్నారు. 206 మందికి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీపీ అక్కపల్లి సుజాతానాగేందర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, తహసీల్దార్ వెంకటేశ్వర్, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్, విండో మాజీ చైర్మన్ రాము, విండో చైర్మన్ సంజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ సావిత్రి, వర్ని మండల అధ్యక్షుడు గిరి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

స్థాయీసంఘ సమావేశంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 21 : రాష్ట్రంలో కొవిడ్ కేసులు నమోదవుతున్నందున వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. జడ్పీ కార్యాలయంలో నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎక్కడైనా విద్యార్థులకు ఇబ్బందులు కలిగితే సంక్షేమశాఖ అధికారులే బాధ్యులవుతారని స్పష్టం చేశారు. 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020-21 నుంచి 2023-24 వరకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ పరిధిలో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని, రూ.11 కోట్లతో మంజూరైన ముల్లంగి-బొంకన్‌పల్లి లిఫ్ట్ పనుల్లో జాప్యాన్ని నివారించి సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలించి పూర్తి చేయించాలని సూచించారు.

చలిమంటకాగుతున్న నగరవాసులు

- ఇందూరును కప్పేసిన పొగ మంచు
- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఇంటికే పరిమితం అవుతున్న జిల్లా ప్రజలు

స్వెట్టర్ల దుకాణం వద్ద సందడి

ఖలీల్‌వాడి, డిసెంబర్21: జిల్లాలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఈ వారం ఆరంభం వరకు సాధారణ స్థితిలో ఉన్న ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి విజృంభిస్తున్నది. వారం క్రితం చలి తీవ్రత తగ్గినా నాలుగు రోజులు నుంచి మళ్లీ చలి పెరుగుతున్నది. జిల్లాలో గురువారం గరిష్ఠంగా 27.9, కనిష్ఠంగా 14.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వారం రోజుల నుంచి ప్రజలు ఉదయం 8 గంటలు అయిన ఇండ్ల నుంచి బయటికి రావడం లేదు. సాయంత్రం 5 గంటల్లోపే ఇండ్లకు చేరుకుంటున్నారు. రెండు రోజులుగా 14.1 ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి మంటలు సాధారణమయ్యాయి.

బయటికి వెళ్లాలంటే చలి నుంచి కాపాడుకునేందుకు ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు. ఉదయం మంచు కారణంగా రోడ్లు కనబడని స్థితిలో ఎనిమిది గంటల వరకు వాహనాలు డిప్పర్ల సహాయంతోనే రోడ్లపై రాకపోకలు సాగిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మంచు కురువడం సాధారణం అయినప్పటికీ శీతల గాలులు ఈశాన్యం నుంచి బలంగా వీస్తున్నాయి. ఈ సమయాల్లో ఆస్తమా, చర్మ సంబంధ, హృద్రోగ బాధితులు, చిన్న పిల్లలకు న్యూమోనియా వ్యాధుల భయం ఉన్నవారు జాగ్రత్తగా వహించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

వారం రోజులుగా ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్ఠ	కనిష్ఠ
16	29.3	16.4
17	28.5	18.1
18	28.5	17.2
19	27.7	16.1
20	26.7	14.2
21	27.9	14.1